క్లుప్తంగా

బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం నేరం



నెహ్రూనగర్: బాల కార్మికుల్ని పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని 21వ డివిజన్ కార్పొరేటర్ కాండ్రకుంట గురవయ్య తెలిపారు. చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొండ వెంకటప్పయ్య కాలనీలో కేవీఎస్‌ఆర్‌టీ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూలులో శుక్రవారం బాల కార్మిక వ్యతిరేక మాసం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలందరిని బడికి వెళ్లే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శైలజ, ఫౌండేషన్ జిల్లా కో–ఆర్డినేటర్ జి. వెంకయ్య, స్కూల్ హెచ్‌ఎం రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో పాల్గొన్న విద్యార్థినులకు అభినందన



గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ 66వ స్కూల్ గేమ్స్‌లో పాల్గొని ప్రతిభ చూపిన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినుల్ని ప్రిన్సిపాల్ జి. సునీత అభినందించారు. సాంబశివపేటలోని కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆమె గ్వాలియర్‌లో గతనెల ఆరో తేదీ నుంచి 12 వరకు జరిగిన హాకీ క్రీడలో పాల్గొన్న సీనియర్ ఇంటర్ విద్యార్థిని ఆర్. అనిత, ఢిల్లీలో జరిగిన బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న సీనియర్ బైపీసీ విద్యార్థిని పీఎన్‌కే హెలెన్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ జి. నరసింహారావు, యూడీసీ కె. ఆదిత్య, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు 'జగనన్న ఆణిముత్యాలు' పురస్కారం



గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పాఠశాల స్థాయిలో ప్రతిభ చూపిన ఏపీ మైనార్టీ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులకు ప్రభుత్వం ద్వారా జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం కింద నగదు ప్రోత్సాహకాల్ని శుక్రవారం పంపిణీ చేశారు. పొన్నూరు రోడ్డులోని పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులు షేక్ ముంతాజ్, షేక్ నసీమా, షేక్ జాస్మిన్‌ను ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు సన్మానించారు. వారికి వరుసగా రూ.మూడు వేలు, రూ.రెండు వేలు, రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతులతో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. రజిని, మధుసూదనరావు, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అపస్మారకస్థితిలో గుర్తు తెలియని వ్యక్తి



గుంటూరు ఈస్ట్: గుర్తు తెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో ఉండి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. అరండల్‌పేట పరిధిలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉండటంతో స్థానికులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 8688831332కు సమాచారం ఇవ్వాలని కోరారు.

వ్యక్తి అదృశ్యం

వ్యక్తి అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కేవీపీకాలనీకి చెందిన ఎం.మహేష్‌బాబు ఈనెల 14న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఎన్‌ఎల్‌సీ సమావేశంలో ఎమ్మెల్యే రోశయ్య



చేబ్రోలు: పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ముంబైలో మూడు రోజుల పాటు జరిగే జాతీయ శాసన సభ్యుల సమ్మేళన మహాసభకు వెళ్లారు. నేషనల్ లెజిస్లేటర్స్ కాన్ఫరెన్స్(ఎన్‌ఎల్‌సీ) లో జరిగిన వివిధ కార్యక్రమాల్లో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్‌తో సమావేశమయ్యారు.

అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ వైఎస్సార్ సీపీ

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరి, మేయర్ కావటి, కార్పొరేటర్ ఆచారి తదితరులు

పట్నంబజారు: అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ వైఎస్సార్ సీపీ అని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. ఆయన శుక్రవారం బ్రాడీపేట మెయిన్ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, స్థానిక ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ(ఆచారి) ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో అత్యంత ప్రధానమైన బ్రాడీపేట ప్రధాన రహదారికి మహర్దశ పట్టిందని తెలిపారు. గత పాలకుల హయాంలో గుంటూరు మొత్తం గుంతలమయంగా మారిన సంగతి అందరికీ తెలిసిందేనన్నారు. సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం దశల వారీగా అభివృద్ధి పనులు చేపడుతోందని తెలిపారు. జిల్లాలో ప్రముఖ వ్యాపార కూడలిగా పేరుగాంచిన బ్రాడీపేట అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించామని చెప్పారు. ఇప్పటికే బ్రాడీపేట 2వ లైనును పూర్తిగా ఆధునీకరించామని, 4వ లైనుస్ పనులు కూడా త్వరలోనే పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ బ్రాడీపేట మెయిన్ రోడ్డులో శంకర్ విలాస్ సెంటర్ నుంచి 18వ అడ్డ రోడ్డు వరకు రూ. 1.20 కోట్ల ఎస్‌సీఎపీ నిధులతో డ్రైన్ టూ డ్రైన్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ గత పాలకుల పట్టనితనం కారణంగా అధ్వానమైన రోడ్లు, అస్తవ్యస్తమైన డ్రైనేజీతో ఏళ్ల తరబడి బ్రాడీపేట సమస్యల వలయంలో చిక్కి విలవిలలాడిందని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గుంటూరు పశ్చిమ ప్రగతిపథంలో పరుగులు పెడుతోందని పేర్కొన్నారు. ప్రతి డివిజన్ అభివృద్ధికి నిలువుటద్దంలా మారిందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పార్టీ నేతలు, స్థానికులు, బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, గులాం రసూల్, గీతా మందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, అరవ తిమ్మరాజు, కార్పొరేషన్ ఈఈ సుందరరామిరెడ్డి, డీఈఈ రఫీక్, ఏఈ రాంబాబు, పార్టీ డివిజన్ కన్వీనర్లు నాగార్జున, గులేచ, డేవిడ్, శ్రావణి, శ్యామ్, విజయమాధవి, మేరిగ విజయలక్ష్మి, పల్లా నారాయణ పాల్గొన్నారు.

గృహ కార్మికుల సంక్షేమానికి కృషి

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కత్తెర హెనీ క్రిస్టినా, సురేష్‌కుమార్, మద్దాళి గిరిధర్, పాల్ ట్రీసా, తెకేనాత్, వ్యాకుల మేరి

గుంటూరు ఎడ్యుకేషన్: గృహ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. మల్లికార్జునపేటలోని సెయింట్ ఆన్స్ మనో వికాస కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గృహ కార్మికుల సమాఖ్య ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హెనీ క్రిస్టినా మాట్లాడుతూ గృహ కార్మికులుగా పని చేస్తున్న మహిళలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాల్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయాల వారీగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలతో అర్హులైన మహిళలందరికీ లబ్ధి చేకూరుతోందని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ సమాజంలో అన్ని రకాల వృత్తుల వారు గౌరవ ప్రదంగా జీవించాలనేది ప్రభుత్వ ముఖ్యోద్దేశమని, దానికి అనుగుణంగా గృహ కార్మికులకు శ్రమకు తగిన వేతనాలు, పెన్షన్ వంటి సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని చెప్పారు. గృహ కార్మికుల న్యాయమైన సమస్యల్ని పరిష్కరించి, హక్కుల సాధనకు సహకారాన్ని అందిస్తామని తెలిపారు. మోంట్‌ఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ వర్గీస్ తెకనేత్ మాట్లాడుతూ గృహ కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. గృహ కార్మికుల హక్కుల్ని పరిరక్షించడంతో పాటు హింస, వివక్షతకు వ్యతిరేకంగా వారిని కాపాడేందుకు సమగ్ర రక్షణ చట్టం అవసరమని తెలిపారు. గృహ కార్మికుల్ని ఈఎస్ఐ, పీఎఫ్‌లో చేర్చి, ప్రభుత్వం ఇళ్లను నిర్మించి ఇవ్వాలని కోరారు. సదస్సులో వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ కత్తెర సురేష్‌కుమార్, గుంటూరు ప్రావిన్షియల్ సుపీరియర్ సిస్టర్ పాల్‌ట్రీసా, మైనార్టీ సంక్షేమశాఖ సలహాదారు డాక్టర్ మద్దు బాలస్వామి, సీఎస్ఎస్ఏ జనరల్ కాన్సులేటర్ సిస్టర్ రీనా జోస్, గృహ కార్మికుల సమాఖ్య కార్యదర్శి సిస్టర్ వ్యాకుల మేరి, సమాఖ్య ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి కలుద్దాం

- వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన కమిషనర్ కీర్తి చేకూరి
- ప్రతి శుక్రవారం కార్పొరేటర్లతో ముఖాముఖి



కార్పొరేటర్లతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: గుంటూరు 'నగరాభివృద్ధికి కలుద్దాం' అనే వినూత్న కార్యక్రమానికి నగర కమిషనర్ కీర్తి చేకూరి శ్రీకారం చుట్టారు. ప్రతి శుక్రవారం కార్పొరేటర్లతో భేటీ అయి వార్డుల్లో సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం కమిషనర్ చాంబర్‌లో కార్పొరేటర్లతో సమావేశమయ్యారు. వారి నుంచి స్థానిక సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా ప్రతినిధుల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని విభాగాధిపతుల్ని ఆదేశించారు. నగరంలో ప్రజా ప్రతినిధులు ప్రజలతో మమేకమై ఉంటారని, వారు గుర్తించిన సమస్యల్ని వెంటనే పరిష్కారనికి చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారం, నగర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి సోమవారం స్పందన, ప్రతి రోజు వార్డ్ సచివాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ప్రజా స్పందన నిర్వహిస్తున్నామని చెప్పారు. వార్డుల్లో మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై కమిషనర్‌తో చర్చించడానికి ప్రత్యేక సమయం కావాలని కార్పొరేటర్లు కోరిన దృష్ట్యా శుక్రవారం కేటాయించినట్లు చెప్పారు. మిగిలిన రోజుల్లో కూడా అందుబాటులో ఉంటామని, వాట్సాప్‌లో తెలిపినా కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్పొరేటర్ల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదులు, ప్రతిపాదనల్ని క్రమపద్ధతిలో రికార్డ్ చేసి, తదుపరి చర్యలు తీసుకోవాలని అధికారుల్ని కమిషనర్ ఆదేశించారు.

పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలి

పాత గుంటూరు: గ్రామ పంచాయతీల అభివృద్ధికి 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని ఏపీ సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు కోరారు. బ్రాడీపేటలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీల్లో తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణకు నిధుల కొరత కారణంగా ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. అఖిల భారత పంచాయతీ పరిషత్ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆరుదల సాంబశివరావు, జిల్లా అధ్యక్షుడు ముప్పాళ్ల మనోహర్, సభ్యులు తోకల సరోజిని నరసింహారావు పాల్గొన్నారు.

నేడు భక్తి సంగీత విభావరి

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలోని అన్నమయ్య కళావేదికపై శనివారం భక్తి సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు కళాలయ మెలోడిస్ వ్యవస్థాపకుడు ఎ.వి. రత్నాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో సంగీత అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

తనిష్క్‌లో గోల్డ్ ఎక్స్ఛేంజ్ వేడుక

పాత గుంటూరు: భారతదేశ అత్యంత విశ్వసనీయ ఆభరణాల బ్రాండ్ తనిష్క్‌లో వందటన్నుల గోల్డ్ ఎక్స్ఛేంజ్ వేడుకను నిర్వహిస్తున్నట్లు ఏరియా మేనేజరు సత్యనారాయణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల బంగారానికి అత్యుత్తమ విలువ అందించడానికి ఎక్స్ఛేంజ్ పాలసీని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. కస్టమర్లు తమ పాత బంగారాన్ని తనిష్క్ అందించే కొత్త డిజైన్లతో అప్‌గ్రేడ్ చేసుకునే అవకాశం కల్పించనట్లు తెలిపారు. టైటాన్ కంపెనీ జ్యువెలరీ డివిజన్ సీఈఓ అజోయ్ చావ్లా మాట్లాడుతూ నేటి ధరల నేపథ్యంలో లాకర్లలో నిరుపయోగంగా ఉన్న బంగారం మార్చుకోవడం ఉత్తమమని సూచించారు. కస్టమర్లు ఈ వేడుకల్లో పాల్గొని తమ పాత బంగారాన్ని మార్చుకోవాలని ఆయన కోరారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ఎంఈవో బలిరాంకు వినతి పత్రం సమర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గుంటూరు ఎంఈవో బలిరాంకు ఏపీటీఎఫ్ (1938) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందు వెళాంగిణిరాజు, మేకల సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని ఎంఈవో కార్యాలయంలో శుక్రవారం బలిరాంను కలిసిన ఏపీటీఎఫ్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు విద్యాశాఖలో విలీనం చేసిన 600 మంది ఉపాధ్యాయులకు రెండు నెలలుగా మినహాయించిన ఏపీజీఎల్ఐ, పీఎఫ్ సొమ్మును ఖాతాల్లో జమ చేయకపోవడం వల్ల పెనాల్టీలు చెల్లించాల్సి వస్తోందని తెలిపారు. సమస్యల్ని తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. నరసింహారావు, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ విజయానంద్, నగర కార్యదర్శి ఏ. జోజప్ప, జిల్లా కార్యదర్శి గణేష్, చంద్రశేఖర్ ఉన్నారు.

23 నుంచి నీట్‌పై అవగాహన తరగతులు

గుంటూరు ఎడ్యుకేషన్: నీట్ పరీక్షలో తొలి ప్రయత్నంలోనే విజయం సాధించడంపై ఈ నెల 23, 24, 25వ తేదీల్లో ఉచిత అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్లు మెటామైండ్ నీట్ అకాడమీ డైరెక్టర్ మనోజ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ దోమలగూడలోని రామకృష్ణ మఠం పక్కనున్న అకాడమీలో ప్రత్యేకంగా బాలబాలికల కోసం ఉచిత హాస్టల్ వసతితో తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నీట్ సాధనలో ఎదురయ్యే సవాళ్లు, టెస్ట్ సిరీస్, నూతన ప్రిపరేషన్ విధానం ద్వారా మెరుగైన ర్యాంకు సాధనపై అవగాహన కల్పిస్తామని వివరించారు. ఇటీవల ప్రకటించిన నీట్‌లో ఉత్తీర్ణులు కాలేకపోయిన విద్యార్థులు నిరాశ చెందకుండా లాంగ్‌టర్మ్‌లో ఏ విధంగా విజయం సాధించాలనే అంశాలను మూడు రోజుల ఫౌండేషన్ తరగతుల ద్వారా వివరిస్తామని తెలిపారు. నీట్ ర్యాంకర్లతో పాటు సీనియర్ అధ్యాపకులు, విషయ నిపుణులు పాల్గొనే అవగాహన తరగతుల్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 85229 58575, 70322 64910 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

రౌడీషీటర్‌పై పీడీ చట్టం నమోదు

నగరంపాలెం: పదహారు కేసులున్న ఓ రౌడీషీటర్‌పై పోలీసులు పీడీ చట్టం నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుడిసెవాసుల కాలనీ రెండో వీధికి చెందిన రౌడీషీటర్ మద్దిరాల గోపి అలియాస్ గోపయ్యను రాజమండ్రి కేంద్ర కారాగారానికి తరలించారు. అతనిపై గుంటూరు నగరంలోని పలు పోలీస్‌స్టేషన్లలో సుమారు 15 క్రిమినల్ కేసులు, ఒక గంజాయి కేసు నమోదై ఉన్నాయి. పలుమార్లు కౌన్సెలింగ్‌లు చేసినా, జైళ్లకు వెళ్లి వచ్చినా ప్రవర్తనలో మార్పు రాలేదు. గంజాయి విక్రయాలు, మరణాయుధాలతో ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేయడం, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవాడు. ప్రభుత్వ, పోలీస్ శాఖ ఆదేశాల్ని పట్టించుకోకుండా శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తుండటంతో అతనిపై పీడీ చట్టం ప్రయోగించినట్లు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేరస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.


సీజీజీబీకి మరో పురస్కారం




పీఎఫ్‌ఆర్‌డీఏ చైర్మన్ దీపక్ మొహంతి నుంచి అవార్డు అందుకుంటున్న సీజీజీబీ చైర్మన్ కామేశ్వరరావు

కొరిటెపాడు(గుంటూరు): చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్(సీజీజీబీ) అటల్ పెన్షన్ యోజన పథకం కింద 2022–23 ఆర్థిక సంవత్సరానికి పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్‌ఆర్‌డీఏ) నుంచి మరో అవార్డును అందుకుంది. బ్యాంకుల ప్రయత్నాలను ప్రోత్సహించడానికి, ఉత్తేజపరచడానికి, పీఎఫ్‌ఆర్‌డీఏ వరుస ఏపీవై బిగ్ క్యాంపెయిన్‌లను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను ఏపీవై బిగ్ బిలీవర్స్ అనే ప్రధాన క్యాంపెయిన్‌ను ఈ సంవత్సరం 15 ఫిబ్రవరి నుంచి 31 మార్చి 2023 వరకు నిర్వహించారు. సీజీజీ బ్యాంక్ ప్రారంభం నుంచి చురుకుగా పాల్గొని పీఎఫ్‌ఆర్‌డీఏ నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించింది. క్యాంపెయిన్‌లో విజేతల్ని గుర్తించి బహుమతులు ఇవ్వడానికి పీఎఫ్‌ఆర్‌డీఏ శుక్రవారం (16వ తేదీ) చెన్నైలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించింది. దీనికి చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ టి.కామేశ్వరరావు హాజరయ్యారు. పీఎఫ్‌ఆర్‌డీఏ చైర్మన్ దీపక్ మొహంతి నుంచి ఏపీవై బిగ్ బిలీవర్స్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కామేశ్వరరావు మాట్లాడుతూ బ్యాంక్ ఉద్యోగులు, బిజినెస్ కరస్పాండెంట్ల నిరంతర కృషి వల్లే అవార్డును గెలుచుకున్నట్లు చెప్పారు.

ఏపీ పీజీ సెట్‌లో చిప్స్ విద్యార్థుల ప్రతిభ



శ్రీవల్లి



భార్గవి



వెంకటరమణ

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించి, వారి ఉన్నతికి కృషి చేయడం తమ కళాశాల లక్ష్యమని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. విద్యాధర్ తెలిపారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఇటీవల విడుదలైన ఏపీ పీజీ సెట్ 2023 ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి కళాశాలకు పేరు ప్రఖ్యాతులు తెచ్చారన్నారు. కళాశాలనుంచి మొత్తం 58 మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. అందులో 51 మంది విద్యార్థులు అర్హత సాధించడంతో పాటు 100లోపు ర్యాంకులు ముగ్గురు విద్యార్థులు సాధించారన్నారు. పీ శ్రీవల్లి 14వ ర్యాంకు, సిహెచ్ భార్గవి, వెంకటరమణ 48వ ర్యాంకు సాధించారన్నారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ సీఎస్ శ్రీనివాస్, కోశాధికారి ఆర్.గోపాలకృష్ణ అభినందించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

సిబ్బందికి ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ సూచన



వైద్యులు, పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హాఫీజ్

నగరంపాలెం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ సిబ్బందికి సూచించారు. పోలీస్ సంక్షేమ దివస్ సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని పోలీస్ యూనిట్ ఆసుపత్రిలో అన్ని పోలీస్‌స్టేషన్ల పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులకు కాటూరి అర్బన్ వైద్య సిబ్బంది ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంమే మహా భాగ్యమని తెలిపారు. అనంతరం వైద్య సిబ్బంది వైద్యసేవలు, నిర్ధారణ పరీక్షలు చేపట్టారు. ఆరోగ్యంగా ఉండేందుకు సూచనలు, సలహాలు అందించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ కె.కోటేశ్వరరావు, డీఎస్పీ చంద్రశేఖరరావు, ఆర్ఐలు థామస్‌రెడ్డి, రాఘవయ్య, ప్రేమ్‌కుమార్, ఆర్ఎస్ఐలు, కాటూరి అర్బన్ వైద్యులు శ్రీనివాస్‌రెడ్డి, నాగేశ్వరరావు, రామకృష్ణ, శ్రీనివాసరావు, ఫర్నీ, సిబ్బంది పాల్గొన్నారు.

కాకుమాను ఎంపీడీవోగా రామకృష్ణ బాధ్యతల స్వీకరణ

కాకుమాను: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఎంపీడీఓగా రామకృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలం ఈఓపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా పదోన్నతిపై కాకుమాను మండల ఎంపీడీఓగా ఇక్కడకి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా ప్రసూనారెడ్డి



తెనాలి: స్థానిక డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా ప్రసూనారెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఆయన స్వస్థలం రాజమహేంద్రవరం. ప్రస్తుతం తమిళనాడు సర్కిల్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయనకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలతో ఆరోగ్య భద్రత

గుంటూరు రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారుల్లో చదువుపై ఆసక్తిని పెంచి, ఆరోగ్య భద్రత కల్పించేందుకు కృషి చేస్తున్నామని ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్ వైజర్ షేక్ మెహరున్నీసా అన్నారు. శుక్రవారం చల్లావారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు జన్ భాగీదారి కార్యక్రమం నిర్వహించారు. 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లల అభివృద్ధి, ప్రీ–స్కూల్‌పై అవగాహన సదస్సు, గ్రాడ్యుయేషన్ డే ను నిర్వహించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకుని చిన్నారులు, తల్లులు ఆరోగ్యంగా జీవించాలని కోరారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఐదేళ్లు నిండిన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే ను నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

25న మా–ఏపీ సభ్యులకు ఈ–శ్రమ్ గుర్తింపు కార్డులు

తెనాలి: మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా–ఏపీ) సభ్యులకు కేంద్రప్రభుత్వం ఈ–శ్రమ్ కార్డులను ఉచితంగా అందజేయనున్నట్టు మా–ఏపీ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా శుక్రవారం తెలియజేశారు. జూన్ 25వ తేదీ ఉదయం 9 గంటల్నుంచి కార్మికశాఖ తెనాలి సహాయ కమిషనర్, ఇనస్పెక్టర్ వినయకుమార్‌లు వీటిని అందజేస్తారనీ, కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే ఈ కార్డులకయే ఖర్చును తమ సంస్థ భరిస్తుందని చెప్పారు. ఈ–శ్రమ్ కార్డులు కలిగిన కార్మికులకు బీమాతో పాటు రూ.2 లక్షల ప్రమాదబీమా సౌకర్యం ఉంటుందన్నారు. చట్టపరమైన సంరక్షణ లేని ప్రదేశాల్లో పనిచేసే భవన నిర్మాణ కార్మికులు, తోపుడుబండ్ల వ్యాపారులు కూడా ఈ–శ్రమ్ కార్డుకు అర్హులైనని చెప్పారు. మా–ఏపీ సభ్యులతో పాటు ఇతర కార్మికులు కూడా తమ సంస్థలో ఈ–శ్రమ్ కార్డుకు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. 25వ తేదీ ఉదయం 9 గంటలకు హాజరయే సభ్యులు/కార్మికులు ఆధార్, బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్, నామినీ బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు ఫొటోలు విధిగా వెంట తెచ్చుకోవాలని సూచించారు. తొలుత పేరు నమోదుకోసం ఆలపాటినగర్, సుల్తానాబాద్‌లోని తమ కార్యాలయాన్ని సంప్రదించాలని వివరించారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

పాత గుంటూరు: పౌర్ణమి సందర్భంగా జులై 3న అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణ మహోత్సవాలకు గుంటూరు –2 డిపో నుంచి ప్రత్యేక హైటెక్ బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జులై 1న రాత్రి 9:10 గంటలకు గుంటూరులో బయల్దేరి జులై 2న శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపులు దర్శించుకొనున్నట్లు పేర్కొన్నారు. 3న అరుణాచలేశ్వరుని దర్శించుకుని, 4న తిరిగి బస్సు గుంటూరు చేరుకుంటుందని తెలిపారు. ప్రయాణికులు ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు.

సీనియర్ వైద్యుడు దక్షిణామూర్తికి అభినందన



తెనాలి: గీతా నర్సింగ్ హోమ్ స్థాపించి తన వైద్యసేవలకు అయిదు దశాబ్దాలైన సందర్భంగా ఆ వైద్యశాల వ్యవస్థాపకుడైన సీనియర్ వైద్యుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, ఆయన కుమారుడు డాక్టర్ వేణుగోపాల్‌ను పట్టణానికి చెందిన పలువురు వైద్యులు శుక్రవారం అభినందనలు తెలియజేశారు. సీటీ స్కాన్ అండ్ డయాగ్నోస్టిక్స్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చందు సాంబశివుడు, డైరెక్టర్లు డాక్టర్ జె.కోటినాగయ్య, డాక్టర్ ఎం.వి. సత్యనారాయణ, డాక్టర్ కె.శివరామకృష్ణ, డాక్టర్ కె.శ్యామ్‌ప్రసాద్, డాక్టర్ వేమూరి శేషగిరిరావు పాల్గొన్నారు. పేదల వైద్యచికిత్సలో డాక్టర్ దక్షిణామూర్తి దాక్షిణ్యాన్ని కొనియాడారు.